EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
02-06-2025
పేజీలు: 02




## రేపు ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్



పంజాబ్ VS ఆర్సీబీ
అహ్మదాబాద్,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో..

# చరిత్ర సృష్టించిన శ్రేయాస్ అయ్యర్

పంజాబ్ కింగ్స్ అదరగొట్టింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఐపీఎల్ 2025 రెండవ క్వాలిఫయర్ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్ లోకి దూసుకెళ్లింది. 2014లో ఐపీఎల్ ఫైనల్‌కు చేరుకున్న పంజాబ్ మరోసారి ఫైనల్ కు చేరుకుని ఈ సారి బెంగళూరు జట్టును ఢీకొట్టనుంది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఫైనల్‌కు మూడు వేర్వేరు జట్లను నడిపించిన ఏకైక కెప్టెన్ గా నిలిచాడు. 2018 ఎడిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అయ్యర్, 2020 ఎడిషన్‌లో ఆ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అప్పుడు ఆ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఐపీఎల్ 2022, 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అయ్యర్., గతేడాది ఆ జట్టును ఫైనల్ కు తీసుకెళ్లి తన తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. పంజాబ్ ను IPL 2025 ఫైనల్‌కు తీసుకువెళ్లడం ద్వారా, అయ్యర్, ధోని, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా తర్వాత వరుసగా ఐపీఎల్ ఫైనల్స్ ఆడిన నాల్గవ కెప్టెన్‌గా. రెండు వేర్వేరు జట్లతో వరుసగా ఫైనల్స్ ఆడిన మొదటి కెప్టెన్‌గా కూడా అయ్యర్ నిలిచాడు.

### కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ రికార్డు

2019: ఢిల్లీ క్యాపిటల్స్ (ప్లేఆఫ్స్)
2020: ఢిల్లీ క్యాపిటల్స్ (ఫైనల్)
2022: కోల్‌కతా నైట్ రైడర్స్ (7వ)
2024: కోల్‌కతా నైట్ రైడర్స్ (ఛాంపియన్)
2025: పంజాబ్ కింగ్స్ (ఫైనల్*)

### శ్రేయస్ అయ్యర్‌కు రూ.24 లక్షల జరిమానా

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 2025 క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ రెండూ స్లో ఓవర్ రేట్‌ను కొనసాగించాయి. ఈ క్రమంలో ఇరు జట్ల కెప్టెన్లు, ఆటగాళ్లకు జరిమానా విధించబడింది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు స్లో ఓవర్ రేట్‌ను కొనసాగించి నందుకు రూ.24 లక్షల జరిమానా విధించబడింది. ఈ నియమాన్ని పంజాబ్ కింగ్స్ జట్టు ఉల్లంఘించడం ఇది రెండోసారి. ఈ క్రమంలో బీసీసీఐ ఓ ప్రకటన విడుదల చేసింది.



## ఐపీఎల్ ప్లే ఆఫ్స్

| | | |
|---|---|---|
| బెంగళూరు vs పంజాబ్ | క్వాలీఫైయర్ 1, మే 29, న్యూ ఛండీఘర్ | |
| గుజరాత్ vs ముంబై | ఎలిమినేటర్, మే 30, న్యూ ఛండీఘర్ | |
| ముంబై vs పంజాబ్ | క్వాలీఫైయర్ 2, జూన్ 01, అహ్మదాబాద్ | |
| ఆర్సీబీ vs పంజాబ్ | ఫైనల్, జూన్ 03, అహ్మదాబాద్ | |









# ఫైనల్‌కు పంజాబ్

ఐపీఎల్-18 సీజన్ ఆసాంతం అద్భుతంగా రాణిస్తున్న పంజాబ్ కింగ్స్ తొలి క్వాలిఫయర్‌లో ఓడినా రెండో క్వాలిఫయర్‌లో అదరగొట్టింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ముంబై నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు.. 19 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి ఛేదించింది. శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 87★, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కు తోడు నెహల్ వధేర (48), జోష్ ఇంగ్లిస్ (38) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. వరుణుడి ఆటంకంతో రెండు గంటల పాటు ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసి ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ముంబై జట్టులోని హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (29 బంతుల్లో 44, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చి మెరుపులు మెరిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి



రెచ్చిపోగా జానీ బెయిర్ స్టో (24 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37, 7 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఈ విజయంతో పంజాబ్ మంగళవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుంది.భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్.. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ ప్రియాన్ష్ (20), మూడో స్థానంలో వచ్చిన జోష్ ఇంగ్లిస్ (38) దూకుడుగా ఆడటంతో ఛేదనను రసవత్తరంగా మార్చేశారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 18 బంతుల్లోనే 42 రన్స్ జోడించారు. కానీ రెండు ఓవర్ల వ్యవధిలో కింగ్స్ ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే కెప్టెన్ శ్రేయాస్, నెహల్ వధేర ధాటిగా ఆడి కింగ్స్‌ను మళ్లీ గెలుపు రేసులోకి తెచ్చారు. టాప్లీ వేసిన 13వ ఓవర్లో శ్రేయాస్ హ్యాట్రిక్ సిక్సర్లతో రెచ్చిపోతే బౌల్ట్ ఓవర్లో వధేర రెండు బౌండరీలు బాదాడు. కానీ నెహాల్, శశాంక్ (2) వెంటవెంటనే నిష్క్రమించినా అయ్యర్ ధాటిగా ఆడి లాంఛనాన్ని పూర్తిచేశాడు.



## వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన మాక్స్‌వెల్

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ గ్లెన్ మాక్స్‌వెల్ అభిమానులకు షాకిస్తూ రిటైర్మెంట్ ప్రకటించారు. సోమవారం వన్డే క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించాడు. 2012లో ఆస్ట్రేలియా తరఫున వన్డేలో అరంగేట్రం చేసిన మాక్స్‌వెల్.. తన 13 ఏళ్ల వన్డే కెరీర్‌కు ముగింపు పలికాడు. తన వన్డే కెరీర్ లో 149 వన్డేల ఆడిన మాక్స్ వెల్.. దాదాపు 4,000 పరుగులు సాధించాడు. 2015, 2019లో ఆస్ట్రేలియా ప్రపంచ కప్ విజయాలు సాధించడంలో గ్లెన్ మాక్స్‌వెల్ కీలక పాత్ర పోషించాడు. అంతేకాదు ఆస్ట్రేలియా చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన వన్డే మ్యాచ్ లు ఆడాడు. కాగా, ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో బరిలోకి దిగిన మ్యాక్స్ వెల్ వేలికి గాయం కారణంగా మధ్యలోనే డ్రాప్ అయ్యాడు. "వన్డే క్రికెట్ నుంచి రిటైర్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. ఛాంపియన్స్ ట్రోఫీలో మొదటి మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు ఇది నాకు మంచి అవకాశం అని నేను అనుకున్నాను. కానీ రాను రాను 50 ఓవర్ల మ్యాచ్ ఆడేందుకు నా శరీరం సహకరించడం లేదు. వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాల్సిన సమయం ఇదే అని నాకు అనిపించింది" అని గ్లెన్ మ్యాక్స్‌వెల్ తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో చెప్పాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా దిగ్గజ ఆల్‌రౌండర్ స్టీవ్ స్మిత్ కూడా వన్డేలకు రిటైర్మెంట్ పలికాడు.





## 4 వేలకు చేరువలో కరోనా కేసులు

దేశంలో కరోనా వైరస్ కోరలు చాస్తోంది. గత కొన్ని రోజులుగా వైరస్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. తాజాగా కొవిడ్ కేసుల సంఖ్య 4వేలకు చేరువైంది. కేంద్ర ఆరోగ్య శాఖ డేటా ప్రకారం.. జూన్ 2 ఉదయం 8 గంటల సమయానికి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,961కి పెరిగింది. వీటిలో కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1435 కేసులు వెలుగు చూడగా.. మహారాష్ట్రలో 506, ఢిల్లీలో 483, గుజరాత్‌లో 338, పశ్చిమ బెంగాల్‌లో 331, కర్ణాటకలో 253 కేసులు వెలుగు చూశాయి. గత 24 గంటల్లో నాలుగు మరణాలు నమోదయ్యాయి. ఢిల్లీ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలో ఒక్కొక్కరు చొప్పున వైరస్ కారణంగా మరణించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 32కి పెరిగింది.

## శ్రీవారిని దర్శించుకున్న సోనూ సూద్

ప్రముఖ నటుడు సోనూ సూద్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం వేకువజామున కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. తాను మొదటిసారిగా 25 ఏండ్ల క్రితం శ్రీవారిని దర్శించుకున్నానన్నారు. మళ్లీ ఇప్పుడు కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చానన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రపంచ శ్రేయస్సు కోసం స్వామివారి ప్రార్థించానని చెప్పారు. నంది పేరుతో కొత్త సినిమాను ప్రారంభిస్తున్నామని, అందులో తాను నటిండటంతోపాటు దర్శకత్వం కూడా చేస్తున్నాని వెల్లడించారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబురం..

# సీఎం రేవంత్ కీలక ప్రసంగం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొనసాగుతున్నాయి.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అమరులకు నివాళులు అర్పించారు. పరేడ్‌గ్రౌండ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.. పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ జెండాను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఆవిర్భావ వేడుకలకు ప్రత్యేక అతిథిగా జపాన్ బృందం హాజరైంది. ప్రజలకు అబివాదం చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పోలీసులకు మెడల్స్ ఇవ్వనున్నారు. ముందుగా సీఎం రేవంత్ రెడ్డి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపం దగ్గర నివాళులర్పించారు.రాష్ట్రంలో మౌలిక సదుపాయాలలో భాగంగా విమానాశ్రయాల సంఖ్యను పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు అన్ని అనుమతులు సాధించాం. హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా దాదాపు 18వేల కోట్ల రూపాయలతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాం. రీజనల్ రింగ్ రోడ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. రీజనల్ రైల్ తో పాటు మెట్రో రైల్ విస్తరణ చేపడుతున్నాం. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూ.24వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖను మరింత పటిష్టపరిచాం. డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపేందుకు చర్యలు తీసుకున్నాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025 ప్రకారం దేశంలోనే తెలంగాణ పోలీస్ నెంబర్ వన్ గా నిలిచింది. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగానికి దుబాయ్ లో అంతర్జాతీయ అవార్డు లభించింది. ఇది మనకు ఎంతో గర్వకారణం. దేశ రక్షణ, సమగ్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా మద్దతుగా నిలుస్తున్నాం. పహల్గామ్ దాడుల ఘటనలో మన సైన్యానికి,



కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో'భారత్ సమ్మిట్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం. ఈ కార్యక్రమం ద్వారా హైదరాబాద్ ను అంతర్జాతీయ వేదికగా మార్చాం. ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి దాదాపు 450 మంది ప్రతినిధులు ఈ సమ్మిట్ లో పాల్గొన్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గారు అందించిన అలీన విధాన స్ఫూర్తితో ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమ్మిట్ లో చర్చించాం. భారత్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్ ను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లాం. సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేసి పేదలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇండ్లు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. నిజమైన లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నాం. ఎంపిక చేసిన కొంతమందికి తొలి దశలో లక్ష రూపాయలు చెల్లించాం. మే 20 నాటికి 5,364 ఇందిరమ్మ లబ్దిదారులకు 53కోట్ల 64లక్షల రూపాయలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమచేసాం. పేదల ఆకలి తీర్చడమే కాదు, వారు ఆత్మగౌరవంతో జీవించేలా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించాం. సంక్షేమ పథకాల చరిత్రలో సన్న బియ్యం ఒక ట్రెండ్ సెట్టర్. తెలంగాణలో మూడు కోట్ల మంది సన్న బియ్యం పథకం ద్వారా లబ్ది పొందుతున్నారు. ఇది విప్లవాత్మక మార్పు. ఖమ్మం జిల్లా సారపాకలో స్వయంగా నేను సన్నబియ్యం లబ్దిదారుల ఇంట్లో భోజనం చేశాను. ఆ రోజు వారి కళ్లలో చూసిన ఆనందం నా గుండెల్లో ఎప్పటికీ నిలిపోతుంది. పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను తీర్చి దిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది.దావోస్, సింగపూర్,జపాన్ లాంటి దేశాల్లో పర్యటించిఇప్పటి వరకు3లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఐటీ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, హెచ్.సీ.ఎల్, కాగ్నిజెంట్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్ లో తమ సంస్థలను విస్తరిస్తున్నాయి. తెలంగాణ రైజింగ్ లో ఇదొక తొలి మెట్టు. ప్రపంచ దేశాల నగరాలకు ధీటుగా హైదరాబాద్ ను తీర్చదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును చేపడుతున్నాం. బాపూఘాట్ ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్ గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం. ఏఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఫార్మా సిటీలతో పాటు లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# విద్యార్థిని టీచర్ మందలించడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు


విద్యార్థిని ఉపాధ్యాయుడు మందలించడం విద్యా విధానాల్లో భాగమని, అటువంటి చర్యలతో స్టూడెంట్ ఆత్మహత్య చేసుకుంటే అందుకు టీచర్‌ను శిక్షించలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుడు మందలించడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు తమిళనాడులో ఓ ఉపాధ్యాయుడిపై నమోదైన ఆత్మహత్యకు ప్రేరేపిత కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ''విద్యార్థిని మందలించడం సహజ విద్యా విధానాల్లో భాగం.. అటువంటి చర్యల కారణంగా విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే. ఉపాధ్యాయుడిని శిక్షించలేం'' అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేసింది.బాలికల హాస్టల్ ఇంఛార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు.. బాధిత విద్యార్థినిని మందలించాడు. ఆ తరువాత రోజు ఆ విద్యార్థిని తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టీచర్ మందలించడంతోనే తన స్నేహితురాలు ఆత్మహత్య చేసుకుందని మరో విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ టీచర్‌పై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కేసు నమోదు చేశారు. తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ సదరు ఉపాధ్యాయుడు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. అక్కడ వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఆరోపణలను కొట్టివేయడంలో నిరాకరించగా.. ఉపాధ్యాయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.ఈ పిటిషన్‌ను విచారించిన



జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం..., హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ కీలక వ్యాఖ్యలు

చేసింది. ''బాధితురాలిని ఉద్దేశపూర్వకంగా శిక్షించినట్టు ఎటువంటి ఆధారాలు లేవు. సాధారణ విద్యా వ్యవహారాల్లో భాగంగా మదలించడం ఆత్మహత్యకు పురికొల్పినట్టుగా భావించలేం. ఈ చర్య పాఠశాల నిర్వహణలో భాగమే. ఉపాధ్యాయుడి ఉద్దేశాన్ని నిరూపించే నిర్దిష్ట ఆధారాల్లేకుండా, అతడిపై కేసును కొనసాగించడం సముచితం కాదు'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆ ఉపాధ్యాయుడు తరఫున వాదనలు వినిపించిన లాయర్ ''బాధిత విద్యార్థిపై వ్యక్తిగత ప్రతీకార ఉద్దేశ్యం లేదు. ఒక సంరక్షకుడిగా విద్యార్థిని బాగోగులు కోరే వ్యక్తిగా మాత్రమే మందలించారు' అని వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. 'ఈ కేసు జోక్యం చేసేందుకు తగింది' కాదని వ్యాఖ్యానించింది. అనంతరం మద్రాస్ హైకోర్టు తీర్పును రద్దు చేసి ఉపాధ్యాయుడిపై కేసును కొట్టివేసింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాలకు న్యాయ పరిరక్షణ కల్పించే దిశగా ఒక ఉదాహరణగా నిలవనుంది. ఇటీవల కాలంలో విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులు.. విద్యార్థులను మందలించడం ఒక నేరంగా చూస్తున్నారు. విద్యార్థి తప్పుచేస్తే దండించడం టీచర్ విధి. కానీ, ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. సుప్రీంకోర్టు తాజా తీర్పు కొంత ఊరట కలిగించిందనే చెప్పాలి.

## ఎన్నో ఏళ్ల నుంచి ఈ కథతో ప్రయాణం చేస్తున్నా



బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా తన డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఇంతకీ అమీర్ ఏం మాట్లాడారు అంటే.. 'ప్రస్తుతానికి నా ఫోకస్ మొత్తం 'సితారే జమీన్ పర్' పైనే. మహాభారతాన్ని ఆధారంగా చేసుకుని ఒక భారీ ప్రాజెక్ట్ రూపొందించాలనేది నా కోరిక. ప్రస్తుత సినిమా విడుదలయ్యాక నా డ్రీమ్ ప్రాజెక్ట్‌పై దృష్టి పెడతాను. దానిని భారీ స్థాయిలో రూపొందించాలని అనుకుంటున్నాను' అని అమీర్ చెప్పారు. అమీర్ ఖాన్ ఇంకా మాట్లాడుతూ.. 'ప్రపంచంలో చూసే ప్రతి విషయం మహాభారతంలో భాగమే. ఇందులో ఎన్నో కోణాలు, భావోద్వేగాలు ఉన్నాయి. నేటితరం ప్రేక్షకులకు దానిని అందించాలంటే భారీ స్థాయిలోనే సిద్ధం చేయాల్సి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ కథతో ప్రయాణం చేస్తున్నా.

## హాట్ లుక్‌లో జాన్వీ కపూర్

జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటించిన తాజా చిత్రం "పరమ్ సుందరి". ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌ను తాజాగా మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే ఈ చిత్రం పరం, సుందరి మధ్య ప్రేమకథగా సాగనుందని తెలుస్తోంది. వీరిద్దరి మధ్య సాంస్కృతి భేదాలు, హాస్యభరితమైన సన్నివేశాలు సినిమాకు హైలెట్‌గా నిలువనున్నాయి. ఈ టీజర్‌లో కేరళలోని అందమైన బ్యాక్ వాటర్స్, హౌస్‌బోట్ల నేపథ్యంలో అద్భుతంగా ఉంది. సిద్ధార్థ్ జాన్వీ ఒక బైకుపై రొమాన్స్ చేస్తూ కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో సోను నిగమ్ ఆలపించిన మధురమైన పాట హైలెట్‌గా నిలిచింది. దినేశ్ విజన్ నిర్మించిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో తుషారా జలోటా దర్శకత్వం వహించారు. ఈ చిత్రం రాజీవ్ ఖండేల్వాల్, ఆకాశ్ దహియా తదితరులు కీలక పాత్రలను పోషించారు.


పరమ్ సుందరి చిత్రం జూలై 25వ తేదీన ప్రేక్షకుల ముందుకురానుంది.



## సినిమాల్లోకి మళ్లీ తప్పకుండా వస్తా

### ఇలియానా

సీనియర్ హీరోయిన్ ఇలియానా ప్రస్తుతం సినీ రంగానికి దూరంగా ఉంది. పైగా ఇప్పటికే, 2023లో పండంటి బాబుకు జన్మనిచ్చింది.తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటిస్తూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిస్తూ.. తన రీఎంట్రీ గురించి కూడా చెప్పింది. ఓ నెటిజన్.. ఆమె నటించిన ఓ హిట్ మూవీ సీక్వెల్ గురించి ప్రశ్నిస్తూ.. "మేడమ్.. 'రైడ్ 2' సినిమాలో మీరెందుకు నటించలేదు? మీ కమ్‌బ్యాక్ ఎప్పుడు ఉంటుంది?" అని ఆ నెటిజన్ అడిగాడు. ఆ ప్రశ్నకు ఇలియానా సమాధానమిస్తూ.."సినిమాలను నేనెంతో మిస్ అవుతున్నా. నాక్కూడా ఆ సినిమాలో భాగం కావాలనిపించింది. 'రైడ్' నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. మాలిని పాత్రలో మరోసారి ఒదిగిపోవాలనుకున్నా. మా దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా, నటుడు అజయ్ దేవ్‌గణ్‌తో కలిసి వర్క్ చేయాలని నాక్కూడా ఉంది. నిజం చెప్పాలంటే, సీక్వెల్ తెరకెక్కించాలనుకున్నప్పుడు టీమ్ నన్ను సంప్రదించింది. మళ్లీ యాక్ట్ చేయమని అడిగింది. కాకపోతే, అదే సమయంలో నాకు బాబు పుట్టాడు.దానివల్ల నా ప్రాధాన్యతలు మారి ఆ సినిమా చేయలేకపోయాను. 'భవిష్యత్తులో సినిమాల్లోకి తప్పకుండా వస్తానని ఇలియానా బదులిచ్చింది.



## ఎన్ని కుట్రలు చేసినా నన్ను ఆపలేరు.. ఎంత నెగిటివ్ ప్రచారమైనా చేసుకోండి

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తోన్న లేటేస్ట్ మూవీ కుబేర. డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. అలాగే ఇందులో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంపై ఇప్పటికే మంచి హైప్ నెలకొంది. భారీ అంచనాల మధ్య రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు. అమిగోస్ క్రియేషన్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. దీంతో ఇప్పుడు ప్రమోషన్స్ షూరు చేసింది చిత్రయూనిట్. తాజాగా జూన్ 1న చెన్నైలో కుబేర్ ఆడియో రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. ఈ కార్యక్రమానికి ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, దేవి శ్రీ ప్రసాద్, అనిరుధ్ వంటి



ప్రముఖులు హాజరయ్యారు. అయితే ఈ వేడుకలో ధనుష్ చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. తన రాబోయే సినిమాలపై వస్తోన్న నెగిటివ్ ప్రచారాన్ని గట్టిగానే ఖండించారు.ధనుష్ మాట్లాడుతూ.. '' మీరు నాపై ఎంత నెగిటివ్ ప్రచారమైనా చేసుకోండి.. కానీ నా సినిమా విడుదలకు ముందు దేనినీ ఆపలేరు. నా అభిమానులు నాతోనే ఉంటున్నారు. నా గురించి నెగిటివ్ ప్రచారాన్ని చేసేవారు దయచేసి పక్కకు వెళ్లి ఆడుకోండి.మాకు ఇలాంటి సర్కస్ వద్దు. ఇక్కడ నా అభిమానులు మాత్రమే కాదు.. నా సహచరులు కూడా ఉన్నారు. దాదాపు 23 ఏళ్లుగా నా అభిమానులు నాతోనే ఉన్నారు. నా గురించి నెగిటివ్ రూమర్స్ ప్రచారం చేసి నన్ను అడ్డుకుంటామని మీరు అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. గతంలో నేను చాలా ఇబ్బందులు పడి ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను. ప్రపంచానికి కుబేర వంటి సినిమా చాలా అవసరం. ఈ మూవీ హిట్ అవుతుందని పూర్తి నమ్మకం ఉంది'' అంటూ చెప్పుకొచ్చారు.

## డాలస్ సభ విజయవంతం..

### జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించిన ఎన్ఆర్ఐలు

బీఆర్ఎస్ అంటేనే భారీ బహిరంగ సభలకు పెట్టింది పేరు. భారీ బహిరంగ సభలు నిర్వహించడంలో బీఆర్ఎస్‌కు సాటి మరెవ్వరూ లేరు. వేదిక ఏదైనా.. జనసమీకరణలో సరికొత్త రికార్డులు సృష్టిండం ఆనవాయితీగా వస్తున్నది. ఇటీవల హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభే దీనికి నిదర్శనం. తాజాగా అమెరికాలోని డాలస్‌లో నిర్వహించిన సభకూ జనం పోటెత్తారు. దేశం కాని దేశంలో సభను నిర్వహించినప్పటికీ ఎన్ఆర్ఐలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డాక్టర్ పెప్పర్ ఎరీనాలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకకు అమెరికావ్యాప్తంగా నుంచే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలతో సభాస్థలి గులాబీమయమైంది. జై తెలంగాణా నినాదాలతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. గులాబీ జెండాలు, తెలంగాణ ఆట, పాటలతో ఎన్ఆర్ఐలు సందడి చేశారు. ప్రవాస చిన్నారులు, మహిళలు తెలంగాణా సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలతో అలరించారు. బతుకమ్మ పాటలకు కోలాటాలు ఆడుతూ మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కేటీఆర్ స్పీచ్‌కు మంచి స్పందన లభించింది. తెలంగాణ మట్టివాసనను అమెరికాకు మోసుకొచ్చిన ప్రవాసులు తమ శ్రమను, సమయాన్ని అభివృద్ధికి వినియోగించడం ఆనందించాల్సిన విషయమమని ఎన్ఆర్ఐలను ఉద్దేశించి కేటీఆర్ అన్నప్పుడు చప్పట్లతో మారుమ్రోగింది. తెలంగాణా రత్నాలుగా, భరతమాత ముద్దుబిడ్డలుగా, తెలుగుతేజాలుగా అమెరికాలో అందరూ రాణించాలని, తెలంగాణా నినాదాన్ని గట్టిగా-గర్వంగా చాటిచెప్పాలని చెప్పడంతో సంబురపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేష్ స్వాగతోపన్యాసం చేశారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ మహేష్ బిగాల సభికులకు ధన్యవాదాలు తెలిపారు.

## మళ్లీ నోరు జారిన రాజేంద్ర ప్రసాద్



నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ఒకప్పుడు హీరోగా వైవిధ్యమైన సినిమాలు చేసి ప్రేక్షకులని ఎంతగానో అలరించారు. ఆయన సినిమాలు ఎన్ని సార్లు చూసిన బోర్ కొట్టేవి కావు. ఇక ఇప్పుడు సపోర్టింగ్ రోల్స్‌లోను నటిస్తూ ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తున్నారు. అయితే ఈ మధ్య రాజేంద్ర ప్రసాద్ సభా సంస్కారం లేకుండా మాట్లాడుతూ విమర్శల పాలవుతున్నాడు. ఆ మధ్య జరిగిన రాబిన్‌హుడ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో వార్నర్‌ని రాజేంద్రప్రసాద్ సరదాగా కామెంట్స్ చేసిన అభ్యంతరకరమైన పదాన్ని వాడడంతో దానిపై చాలా మంది సీరియస్ అయ్యారు. ఆయన సరదాగా మాట్లాడినప్పటికీ ఆ విధానం కరెక్ట్‌గా లేదని చాలా మంది అభిప్రాయపడ్డారు. తన వ్యాఖ్యలు ట్రోల్‌కు గురవడంతో రాజేంద్రప్రసాద్ క్షమాపణలు తెలిపారు.తాజాగా మరోసారి తన వ్యాఖ్యలతో వివాదంలో చిక్కుకున్నారు. దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొన్న రాజేంద్ర ప్రసాద్ మైక్ అందుకుంటూనే దురుసుగా మాట్లాడాడు. అంతే కాకుండా నటుడు ఆలీని అందరి ముందే తిట్టేశారు. ఆలీని ఉద్దేశించి వాడిన పదజాలం తీవ్ర దుమారం రేపుతుంది. దీనిపై నెటిజన్స్ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ తన స్పీచ్‌లో భాగంగా.. మీరందరూ వస్తున్నారని నాకు చెప్పలేదు, రాకుంటే నేను మిస్ అయ్యే వాడిని. ఏరా అచ్చన్న (నిర్మాత అచ్చిరెడ్డిని)_ _ _ బయటికి రా నీ సంగతి చూస్తా'' అంటూ ఫైరింగ్ మీద కనిపించాడు. ఇక ఆలీగాడు ఎక్కడ ఉన్నాడు అంటూ ఓ బూతు పదం వాడి.. ఇదంతా మనకు కామనే అని అన్నాడు.